# ఎవరు హోప్‌లెస్‌ఫెలో ?

కె. వరలక్ష్మి

కథ

"నువ్వంటే నాకు చాలా ఇష్టం"

"అవునా....!"

"ఎందుకు అని అడగవేం"

"ఎందుకు?"

"నువ్వుచాలా కొత్తగా, ఫ్రెష్షుగా ఉన్నావు గనక"

"మరి నేనూ ఈ కొత్తదనం, ఫ్రెష్‌నెస్సూ కోల్పోతే?"

"ఛా, అలాగెందుకౌతుందిరా?"

"ఎందుక్కాదు, ఒకామె అయ్యిందిగా"

"అది వేరు"

"ఇది వేరా ?"

"అవును"

"ఎలా?"

"ఆమెకీ నీకూ పోలికే లేదూ. నాక్కావాల్సిందంతా నీ దగ్గరే దొరికింది. నక్కెక్కడ, నాగలోకం ఎక్కడ?"

"ఎవరు నక్క, ఎవరు నాగలోకం?"

"నోర్ముయ్యవే మాలోకం, హోప్‌లెస్ ఫెలో, ఆమెని గుర్తుచేసి మూడంతా చెడగొట్టేవ్, ఇప్పుడు చూడు, బండి మొదటికొచ్చింది"

"అదెప్పుడూ మొదట్లోనేగా ఉండేది!"

"ఛీ, నీ... వచ్చేవారం వస్తాలే మళ్లీ. ఇంటి కాడ అది ఎదురు చూస్తా ఉంటాది"

"అవును, ఎళ్లెళ్లు"

✿ ✿ ✿

"ఇట్రా, నా ఛాతీపైన తల పెట్టుకో. ఈ ఛాతీ చూసేవా, ఇది మొనగాడి ఛాతీ"

"అవునా....!"

"అసలు వయసులోఉన్నప్పుడు నేనంటే ఆడముండలు పడి చచ్చిపోయేవాళ్ళు తెల్సా...."

"ఎందుకో...?"

"ఏముంది, ఎర్రగా బుర్రగా హేండ్సమ్‌గా ఉంటానని. నా హైటెంతో తెల్సా, ఫైవ్ లెవెన్"

"అరె, నా కన్నా ఒక గుప్పెడేగా ఉన్నావ్, ఫైవ్ ఫైవనుకున్నానే!"

"ఛీ, నీకసలు స్వీటుగా మాట్లాడ్డమే రాదే, నా పెళ్లాం ఏమంటుందో తెల్సా, 'అసలు నువ్వు దొరకడం అన్ని విధాలా నా అదృష్టమయ్యా' అంటుంది.

" (నీ అసలు స్వరూపం తెలీక కావచ్చులే, తెలిసినా ఆవిడ అవసరం అలాంటిది) అబద్దాలు స్వీటుగా ఉంటాయిలే"

"నువ్వింత కొరకరాని కొయ్యవనుకోలేదు. ఎంత అమాయకంగా కన్పించేవు మొదట్రోజు"

"ఈ రోజుల్లో అమాయకమైన ఆడది కావాలంటే పిచ్చాసుపత్రి కెళ్ళాల్సిందే"

"ఏంటో, నువ్వేం మాట్లాడినా నీ మీద మోజు పెరుగుతుందే గాని తరగడం లేదు".

"ఓహో, దీన్ని మోజంటారా? అయితే, నా పుట్టిన్రోజొస్తోందిగా, నాకో చీర కొనిపెట్టు"

"కొంటాలే ఇట్రా నా ముద్దుల పెళ్లామా".

"ఛీ, అదేం మాట?"

"ఏం, పెళ్లాం అంటే తప్పేముంది ఇంతవరకొచ్చాక?"

"మరి ఇంట్లో ఉన్న ఆమె ఎవరు?"

"అదీ పెళ్లామే, ముసలి పెళ్లాం. మొగోడికి వయసయ్యేపాటికి ఒక ముసలిపెళ్లాం ఇంట్లో అవసరం అన్నారు పెద్దలు"

"నీ కన్నా ముసలిదా ఆమె?"

"అంటే నేను ముసలోణ్ణంటావా ! చూస్తున్నావుగా నా ప్రతాపం"

"అవునవును, నీ మొబైల్ రింగవుతోందదిగో"

"హలో... ఏంట్రా కన్నా... అవునా, అదేం లేదే. నా గొంతు మామూలుగానే ఉందే. కోప్పడకురా. వేళకి మందులేసుకుంటూనే ఉన్నాగా ! నా కోసం బెంగపడకు. నా కిక్కడ కేంప్‌వర్క్ చాలా హెవీగా ఉంది... టిఫిన్ చేసుకుని తిన్నావా? వేళకి అన్నం వండుకుని తిను. నేను లేనని పస్తులుండకు.. పిచ్చీ... పిచ్చి,, ఇంట్లో అన్నీ చక్కబెడుతూ తిరక్కు హాయిగా రెస్టు తీసుకో. ఓకేనా, టేక్కేర్. ఇక్కడ నన్నా వీళ్ళు చాలా బాగా చూసుకుంటున్నారు. నేనసలే ఆఫీసులో దూర్వాసముండా కొడుకునని అందరికీ తెలిసిందే కదా ! ఉంటాన్రామరి, జాగ్రత్త"......

"ఏం నటిస్తున్నావయ్యా బాబూ !"

"నటించకపోతేఎలా చెప్పు, ఇదంతా నీకోసమే కదా".

"నా కోసమా?"

"అదే అదే, నా కోసమైన నీ కోసం"

"అవునా, హోప్‌లెస్ ఫెలో"

✿ ✿ ✿

"నేననుకోవడం ఇది నాలో పరిధులుదాటి పొంగి పొర్లుతున్న ప్రేమని"

"మరి ఆ ప్రేమని చూపించవేం?"

"చూపిస్తున్నాగా"

"ఏది?"

"ఇదంతా ఏంటి, నీ కోసం అంతదూరం నుంచి ఎందుకొచ్చేను? ఇన్నిన్ని కబుర్లు ఎందుకు చెప్తున్నాను !"

"ఓహో ఇదేనా ప్రేమంటే, ఈ చొప్పదంటు కబుర్లా?"

"ఛీ, నీకసలు రసాస్వాదనే తెలియదు"

"ఇప్పుడిప్పుడే నీ రసాస్వాదన అనుభూతిలో కొస్తోంది"

"ఎందుకురా నీరసం పిచ్చికన్నా నేనుండగా"

"ఎక్కడుండగా?"

"నీ ఎదుట"

"నెలకో రోజా ?"

"ఇంతకన్నా ఎక్కువైతే అక్కడ ముసల్దానికి

అనుమానం వచ్చెయ్యదూ"

"అంత భయమున్నవాడివి అక్కడే ఉండ రాదూ"

"భయమా పాడా ! అది భయం కాదు. అదుపు"

"ఓహో, ఇప్పుడు ఆమె అదుపులో నువ్వున్న ట్టన్నమాట !"

"ఏదో ఒకటనుకో, ఇట్రా, మాట"

"పెళ్లాం, పెళ్లాం అంటావ్, ఒక్కచీర కొనిపెట్టలేక పోయేవ్, ఆమెకైతే అలాగే చేస్తావా?"

"ఆమెకి నేనెప్పుడూ ఏమీ కొనలేదు ఇప్పటిదాకా, తెల్సా"

"నిజమా?..."

"ఎందుకంత ఆశ్చర్యం? నిజం"

"మరెవరు కొంటారు?"

"తనే కొనుక్కుంటుంది చీరలైనా, నగలైనా. డబ్బులు మొత్తం ఆమె చేతుల్లోనేగా పోస్తాను.!"

"మరి నేను?"

"నీకేం లోటు, నువ్వు ఉద్యోగం చేస్తున్నావు. నీకు సేలరీ వస్తుందిగా, నీ కన్నా దర్జాగా ఎవరుండ గలరు? మొన్న నువ్వు కొని పెట్టిన ఉంగరం నాకెంత నచ్చిందో తెల్సా!(ఇంటికెళ్లే ముందు తీసి దాచేస్తున్నా)"

"అందుకే ఈనెల ఇంట్లో కొంత ఇబ్బందవు తోంది. పదే పదే పెళ్ళాం అంటున్నావు కాని, నాకేం ఇబ్బందులున్నాయో కనుక్కుంటున్నావా?"

"యూ సిల్లీ గాళ్, నీకేం ఇబ్బందులు?"

"నిజం... ఈనెల కొంత బడ్జెట్‌లోటు, కొంచెం... ఏమైనా... డబ్బులు సర్దగలవా...?"

"అరరే, క్రెడిట్ కార్డు, ఎ.టి.ఎమ్‌కార్డు ఇంట్లో మరచిపోయేనే... జేబులో చార్జెస్‌కి సరిపడా వేసుకొచ్చేనంతే"

"ఫర్వాలేదు, ఇంటికెళ్లాక పంపించు ఆన్‌లైన్లో. ఐదువేలు చాల్లే"

"..........."

"మాట్లాడవేం?"

"సారీ యార్. ఆవిడ వోచర్సన్నీ లెక్క చూసుకుం టుంది. బేంక్ ఎకౌంట్లన్నీ ఆమె పేరునే ఉన్నాయి"

"ఆమె ఏం చదువుకోలేదన్నావ్"

"చదువుకోలేదంటే నా ఉద్దేశం.. పెద్దగా చదువుకోలేదని, ఓల్డ్ పి.యు.సి, అయినా డబ్బులు లెక్కపెట్టుకోడానికి చదువెందుకు"

"జబ్బు మనిషన్నావ్"

"ఓపిక లేకపోవడం జబ్బేగా ! అసలు డబ్బు ప్రసక్తి మనమధ్య ప్రేమను చెడగొడుతుంది తెల్సా"

"అయితే వీలు పడదంటావ్"

"సారీ యార్, ఇంకేమైనా అడుగు. నా ప్రాణం ఇమ్మంటావా"

"నీ ప్రాణం ఎవడిక్కావాల్రా యూజ్‌లెస్ ఫెలో, పెళ్లాం మీద చాడీలు చెప్పి మరో ఆడదాని సానుభూతి సంపాదించే బ్రూట్."

"అబ్బో అబ్బో తిట్లే? నువ్వు కోపంలో మరింత బావున్నావు తెల్సా"

"సిగ్గనిపించడం లేదా?"

"అదికాదురా బంగారం, నువ్వు నా ప్రేమను అర్థం చేసుకోవట్లేదు, నాకేదుపొస్తోంది. నా కళ్లల్లో నీళ్లెలా ఊరి వస్తున్నాయో చూడు"

"ఛీ, నీకా ప్రేమ అనే పదాన్ని ఉచ్ఛరించే అర్హత కూడా లేదు, నీ ప్రేమను చేటల్తో ఎత్తిపోసుకో. అక్కణ్నుంచి ఫోన్లో నాతో ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడు తున్నట్టే ఇక్కణ్నుంచి ఆమె తోనూ మాట్లాడుతున్నప్పుడే నాకర్థమైంది. నువ్వెలాంటి డబుల్‌గేమ్ ఆడుతున్నావో, అందుకే, నీ నైజం తెలుసుకోడానికే అయిదువేలు కావాలన్నాను"

"(అయితే నిజంగా వద్దన్నమాట) అది కాదూ... నీకు డబ్బులు కావాలా, అప్పు చేసి తెచ్చిస్తాను"

"మాట్లాడకు ప్లీజ్, వెళ్లు. నాకు కన్పించకు"


"అనవసరంగా గొడవ పడకు. శీలం చెడిపోయిన దానివి, నిన్నెవడూ పెళ్లి చేసుకోడు. పోనీలే పాపం అని..."

"బైటికి నడుముందు"

"నువ్వు తొందరపాటుతో గొప్ప ప్రేమను కాలదన్నుకుంటున్నావ్. నా కోసం ఎన్నాళ్లుగానో వినత కాచుకుని ఉంది తెలుసా !"

"ఛీ పోరా కుక్కా ! ముందు నా గడపదాటు"

"హోప్‌లెస్ ఫెలో... హోప్‌లెస్‌ఫెలో..."

నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు

Tel.: (O) 232693
232393
(R) 232893
Fax : 08676 - 232593
Cell : 94401 58793
98489 10892

సుధీర్ టింబర్ డిపో

శ్రీ వెంకట వంశీకృష్ణ ట్రేడర్స్

నూకల లింగమూర్తి
వ్యవస్థాపకులు

తోట్లవల్లూరు రోడ్, యాకమూరు - 521 165.
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

✿ మా వద్ద మనదేశంలోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, అస్సాం, బెంగాల్ మరియు ఇతర రాష్ట్రముల నుంచి ఖరీదు చేయబడిన అతి నాణ్యమైన టేకు, వేగిస, బండారు గుగ్గిలం, మరియు మహారాష్ట్ర నుండి ఖరీదు చేయబడిన వేప సైజులు హోల్‌సేల్ మరియు రిటైల్‌గా సప్లయ్ చేయు అతి పెద్ద సంస్థ. ✿ ఏ రోజు ఆర్డరు ఆరోజే డెలివరీ చేయబడును. ✿ చిత్రి మిషనుల సౌకర్యము కలదు. ✿ అతి తక్కువ ఖర్చుతో డెలివరీ సౌకర్యము. ✿ జనరేటర్ సౌకర్యము కలదు.